నేరాల అదుపునకు సహకరించాలి


మాట్లాడుతున్న సీఐ నర్సింహ

జగద్గిరిగుట్ట: నేరాల అదుపునకు అందరి సహకారం అవసరమని జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ అన్నారు. గురువారం స్టేషన్ పరిధిలోని వాంబే గృహాల సముదాయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత తప్పుదోవ పట్టకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడూ వారిని గమనించాలని సూచించారు. కాలనీలకు అపరిచిత వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా పిల్లలు గంజాయికి బానిస కాకుండా చూసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలను అమ్ముతున్న వారి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని, వారి పేరు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇటీవలే సైబర్ మోసాలు ఎక్కువయ్యాయని, వీటిపై జాగ్రత్త వహించాలని వివరించారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరస్తులను పట్టుకోవడానికి సునాయసం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, ఎస్ఐ శంకర్, విఠల్ ముదిరాజ్, సీహెచ్ దాసు, సాయిలు యాదవ్, మురళి, శ్యామ్ రావు, నాయకురాలు మౌనిక, కాలనీ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్


పట్టుబడ్డ వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

సుభాష్‌నగర్: రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించని వాహనదారులపై జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకదృష్టి సారించారు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ నేతత్వంలో కొన్ని రోజులుగా రోజుకు ఒక నిబంధనపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ రోడ్డు నిబంధనలపై అవగాహన కలిప్తున్నారు. శుక్రవారం నంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్ ఉన్నా వాహనాలకు అమర్చకుండా రోడ్లపై తిరుగుతున్న 60 వాహనాలను గుర్తించి, వారి ఇళ్ల వద్ద ఉన్న నంబర్ ప్లేట్లను తెప్పించి వాహనానికి అమర్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ..నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపే వారిలో అత్యధికంగా యువకులే ఉంటున్నారని, తల్లిదండ్రులు వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వక్ఫ్ జాబితా నుంచి స్థలాలను తొలగించాలని వినతి


అధికారులకు వనితిపత్రం అందజేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: వక్ఫ్ బోర్డు పేరుతో ప్రైవేట్ భూములను చట్ట విరుద్ధంగా నిషేధిత జాబితాలో చేర్చారని బీజేపీ నిజాంపేట్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. ప్రైవేట్ భూములపై వక్ఫ్ పెత్తనాన్ని తొలగించి రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని సబ్‌రిజిస్ట్రార్ అధికారులకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుండిగల్ పరిధిలోని సర్వే నెంబర్ 72, కొంపల్లిలో సర్వే నెంబరు 4, నాగులూరులో సర్వే నెంబర్ 3లలో దాదాపు 2116 ఎకరాల ప్రైవేట్ భూమిని వక్ఫ్ జాబితాలో చేర్చారని, దీంతో సంబంధిత భూముల యజమానులు క్రయ విక్రయాలు జరిపేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుండిగల్ మండల పరిధిలో వక్ఫ్ బోర్డు సంబంధించిన ఆస్తులు రెవెన్యూ రికార్డు ప్రకారం 244.15 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. రెవెన్యూ శాఖ ఉండి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు భూముల విషయమై సమగ్ర నివేదిక తెప్పించుకుని నిషేధిత జాబితాలో చేర్చిన భూములకు తక్షణమే రిజిస్ట్రేషన్‌లు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చందు, అరుణ్ రావు, శ్యాం కుమార్ రెడ్డి, మహేందర్, ఈశ్వర్ రెడ్డి, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఆర్‌ఐటీలో ఈక్వినాక్స్ 2కే24


ఈక్వినాక్స్ 2కే24లో పాల్గొన్న కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్‌ఐటీ) కళాశాలలో ఈక్వినాక్స్ 2కే24 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా పిచ్ డెక్ కాంపిటీషన్, ఇంక్యుబేషన్ ప్యానెల్ చర్చల శీర్షికతో ప్రపంచ సవాళ్లకు పరిష్కారాలను అందించారు. టాలెంట్‌ఫార్మ్ సహ వ్యవస్థాపకుడు పంకజ్ దివాన్, లైఫ్ సైన్సెస్ ప్రొఫెషనల్, వ్యవస్థాపకుడు డాక్టర్ సూరజ్, టీసీ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి బాల ప్రసాద్ పెద్దిగారి, ఎస్‌ఏపీ డైరెక్టర్ మనీష్‌గుప్తా విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. అదే విధంగా నూతన ఆవిష్కరణలు, వాటి ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈక్వినాక్స్ 2కే24 విద్యార్థుల్లో వ్యూహాత్మక ఆలోచనలను పరీక్షించడం, హస్టిల్‌మేనియా, మార్కెటింగ్ నైపుణ్యాలను ప్రదర్శించడం, క్రాస్‌రోడ్స్, టీమ్‌వర్క్‌ను ప్రోత్సహించడం తదితర లక్ష్యాలతో నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రేయారెడ్డి, ధీరస్‌రెడ్డి, హాస్య నటుడు హృదయ్ రంజన్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

మహీంద్రా యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ డిజిటల్ మీడియా అండ్ కమ్యూనికేషన్ కోర్సు


కోర్సును ప్రారంభిస్తున్న చాన్స్‌లర్ ఆనంద్ మహీంద్రా తదితరులు

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని మహీంద్రా యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ డిజిటల్ మీడియా అండ్ కమ్యూనికేషన్ నూతన కోర్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ చాన్స్‌లర్ ఆనందర్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రత్యేకమైన ఎస్డీఎంసీ భవనంలో మల్టీ–కెమెరా షూటింగ్ ఫ్లోర్, లైటింగ్ గ్రిడ్ ప్రొడక్షన్ కంట్రోల్ రూమ్‌తో కూడిన పూర్తి స్థాయి ఆడియో విజువల్ స్టూడియో సదుపాయాలతో కోర్సును అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. కోర్సులో భాగంగా విద్యార్థులకు పాడ్‌కాస్ట్ స్టూడియో, మొబైల్ జర్నలిజం (మోజో) స్టూడియో, క్రియేటర్ స్టూడియో, ఇమ్మర్సివ్ (వీఆర్ - ఎక్స్‌ఆర్) స్టూడియో ఫ్లోర్‌తో పాటు అధునాతన యాపిల్ ల్యాబ్, పరిశ్రమతో ప్రామాణిక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లతో కూడిన అత్యాధునిక ఎడిటింగ్, పోస్ట్-ప్రొడక్షన్ సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. అదే విధంగా 2025–26 విద్యా సంవత్సరానికి మాస్టర్ ఆఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ కొత్త డిగ్రీ ప్రోగ్రాంను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎయిర్‌బస్ (ఇండియా) ప్రెసిడెంట్, ఎండీ రెమి మైలార్డ్, మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యాజులు మెదూరీ, స్కూల్ డీన్ డాక్టర్ శశిధర్ నంజుండయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష పద్ధతిలో మార్పులు వద్దు

సాక్షి,సిటీబ్యూరో: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి పరీక్ష పద్ధతుల్లో మార్పులు చేయకుండా పాత విధానంలోనే నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 90 రోజుల ముందు పరీక్షల్లో మార్పుల నిర్ణయం తీసుకోవటం వల్ల విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురయ్యే అవకాశముంటుందన్నారు. పరీక్షల పద్ధతిలో తీసుకునే మార్పులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి తీసుకుంటే విద్యార్థులు ఆ విధానంతో పరీక్షలకు సిద్ధమవ్వటానికి వీలుంటుందని ఆయన తెలిపారు. పరీక్షల్లో ప్రస్తుత మార్పుల వల్ల మార్కులలో అసమానతలు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆలోచించాలన్నారు.

కేసీఆర్ ఓ చరిత్ర..

దానిని ఎవరూ చెరపలేరు

శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్
బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఘనంగా దీక్షా దివస్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజు


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు
- పెద్ద ఎత్తున తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

దుండిగల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓ వ్యక్తి కాదని.. చరిత్ర అని.. ఆ చరిత్రను ఎవరూ చెరపలేరని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు అమరవీరుల స్థూపం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించిన రోజే ఈ దీక్షా దివస్ అని వివరించారు. 60 ఏళ్ల కాలంలో అన్ని రంగాల్లో వివక్షకు గురై ధ్వంసమైన తెలంగాణ ప్రాంతాన్ని కేంద్రం మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల కాలంలోనే దేశ తలసరి ఆదాయాన్ని మించిన ఆదాయంతో కేసీఆర్ అభివృద్ధి చేశారన్నారు. నేటి కాంగ్రెస్ పాలకులు మాత్రం తెలంగాణ చరిత్రలో కేసీఆర్‌ను ప్రజలు మర్చిపోయేలా అభివృద్ధి చేస్తామంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

అందరికీ సంక్షేమ పథకాల ఘనత కేసీఆర్‌దే..

తెలంగాణలో నివసించే ఏ రాష్ట్ర ప్రజలైనా మావాళ్లే అని, అందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఉమ్మడి పాలనలో అడుగడుగునా వివక్షతకు గురైన ప్రాంతం తెలంగాణ అని గుర్తు చేశారు.

ఉద్యమమే ఊపిరిగా..

ఉద్యమమే ఊపిరిగా నిలిచిన నేత కేసిఆర్ అని, ఆ నాడు కొందరితో మొదలైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు నాలుగు కోట్ల ప్రజలు గొంతు కలిపారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కేసీఆర్ చూపిన బాటను నమ్మిన ప్రజలకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఎన్నో లాభాలు చేకూర్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుచూపిస్తుందన్నారు. హైదరాబాద్ నగరాన్ని అండర్ పాసులు, ఫ్లై ఓవర్‌లు, మెట్రో విస్తరణతో కేసీఆర్ మరింత అభివృద్ధి చేశారన్నారు. అనంతరం బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు భారీ ఎత్తున పాల్గొన్నారు.


హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు

ఆలయంలో నేడు అన్నదానం

జగద్గిరిగుట్ట: చింతల్, శ్రీసాయి కాలనీలోని అభయ ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నేకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కళ్యాణ్ రావు పాటిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి



కుత్బుల్లాపూర్: వేణుగోపాల స్వామి ఆలయంలో కొలువై ఉన్న గంగాభవాని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు.

8 గొర్రెల మృత్యువాత


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో 8 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్ గ్రామానికి చెందిన జక్కుల నగేశ్ యాదవ్ గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల నగేశ్ తన గొర్రెలకు నట్టల మందు ఇచ్చాడు. శుక్రవారం గ్రామ శివారులో మేత మేస్తు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. నట్టల మందు వికటించి గొర్రెలు మృతి చెందాయా?.. లేక విషపు ఆకులను తిని చనిపోయాయా? అన్నది పోస్టుమార్టం నివేదికలో తెలియాల్సి ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్‌లో ఆగని పొగ


ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పరిశ్రమ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు

జీడిమెట్ల: ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి 72 గంటలు అయినప్పటికీ పరిశ్రమ నుంచి పొగలు వెలువడుతూనే ఉన్నాయి. అగ్నిమాపక, డిజాస్టర్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది దాదాపు 5 లక్షల లీటర్ల నీటిని ఉపయోగించారు. పరిశ్రమ కూలిన స్లాబ్‌ల కింద నుంచి ఇప్పటికి నల్లటి పొగలు వస్తుండటంతో చుట్టు పక్కల ప్రజలు కళ్ల మంటలతో ఇబ్బందులు పడుతున్నారు. అగ్నిప్రమాదం జరిగిన పరిశ్రమ వద్ద అధికారులు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుందామన్నా అక్కడకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇప్పటి వరకు పరిశ్రమలో జరిగిన ప్రమాదానికి కారణం మాత్రం తెలియడం లేదు. పీసీబీ అధికారులు స్థానికంగా మీటర్లను అమర్చారు. మరో 24 గంటల్లో పరిశ్రమ నుంచి వచ్చే నల్లటి పొగలు ఆగిపోతాయని జీడిమెట్ల ఫైర్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్


గంజాయితో పట్టుబడ్డ నిందితులు నాగరాజు, అన్వేష్

కుత్బుల్లాపూర్: లక్ష రూపాయలు విలువ చేసే గంజాయిని మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకుని ఇద్దరి నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మచిలీపట్నం ప్రాంతానికి చెందిన బలగం నాగరాజు(33), బలగం అన్వేష్(33) కొంత కాలంగా నగరంలో గంజాయి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సుచిత్ర చౌరస్తాలో గంజాయిని కూకట్‌పల్లికి చెందిన రఫీకి విక్రయించేందుకు యత్నిస్తుండగా మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 8.749 కిలోల గంజాయి, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పాల్గొన్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ మాధవయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేశ్వరరావు, సత్తార్, కానిస్టేబుల్ సంజయ్‌లను అభినందించారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించి కొనుగోలుదారుల వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముమ్మరంగా కల్వర్టు నిర్మాణ పనులు

జగద్గిరిగుట్ట: షాపూర్ నగర్ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే రోడ్డులో కల్వర్టు పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రతీ సంవత్సరం వర్షాలు పడినప్పుడల్లా ఈ కల్వర్టు వద్ద నీరు మోతాదుకు మించి ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2 నెలల క్రితం ఎంపీ ఈటల రాజేందర్ స్వయంగా వచ్చి సమస్యకు గల కారణాలు తెలుసుకున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. దీనికి స్పందించిన అధికారులు సుమారు కోటి రూపాయలు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. ఈ రోడ్డులో 3 కల్వర్టులు ఉండగా.. ఈ ఒక్క కల్వర్టు పనులతో ఈ సమస్య తీరేది కాదని, మిగతా కల్వర్టు పనులు కూడా పూర్తి చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఎగ్జిబిషన్‌తో యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం


పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేఐఏ సభ్యులు

జీడిమెట్ల: జీడిమెట్ల ఇండస్ట్రీయల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా ఉందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. జేఐఏ అధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయికిషోర్ ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన స్టాల్స్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భీమరాజు, గంధం కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజాంపేట్: ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని కార్యాలయంలో నిజాంపేట్ మున్సిపల్ బంజారా సేవా సంఘం కమిటీ సభ్యులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. బంజారా కమిటీ హాల్, మాతా జగదాంబ మరుయయ్మ, సేవాలాల్ ఆలయాలకు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సేవ లాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రనాయక్, మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు హరియానాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాములు నాయక్, సేవలాల్ సేన జాతీయ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్పీ నాయక్, గోపాల్ నాయక్, తుకారం నాయక్, సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ


మహాపడి పూజలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


కుత్బుల్లాపూర్: సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్‌లో శుక్రవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వాముల భజన గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ పెండ్లి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, కృష్ణగౌడ్, రమేష్ మంజుల్కర్, వీరేష్ గుప్తా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాగదేవత ఆలయ 6వ వార్షికోత్సవం


మల్లారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రంగారెడ్డినగర్: పంచశీల కాలనీలోని నాగదేవత ఆలయ 6వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి నాగదేవతకు భక్తులు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నందనం దివాకర్ ఆయనను సత్కరించారు. ఆలయ కమిటీ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతోనే ప్రత్యేక రాష్ట్రం



దీక్షా దివస్‌లో పాల్గొన్న బీఆర్ఎస్‌వీ నాయకులు

నిజాంపేట్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్ అన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయ ఆవరణలో దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వాసు నాయక్, కృష్ణ ప్రసాద్ నాయక్, శ్రీదివ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రైతులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు

సాక్షి,సిటీబ్యూరో: కొత్త ప్రభుత్వం పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్‌లోని అమిస్తాపూర్‌లో నిర్వహిస్తున్న రైతు పండుగ బహిరంగ సభకు మేడ్చల్ జిల్లా నుంచి రైతులను పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ తెలిపారు. ఇందు కోసం మూడుచింతలపల్లి, అలియాబాద్, కీసర రైతు వేదికలు, మేడ్చల్ మండల వ్యవసాయ కార్యాలయం, ఎదులాబాద్‌లలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సంవత్సర కాలంలో ప్రజా ప్రభుత్వం రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, సన్న వడ్లకు బోనస్, రైతు బీమా తదితర పథకాల ద్వారా రూ.50 వేల కోట్లు రైతులకు అందించినట్లు ఆమె తెలిపారు.